# ★ స్వర్ణకారుడు ★

— రచన: “రాజశేఖరుని”

పొద్దు గూట్లోపడింది బస్సొచ్చి ఊరి మధ్య సత్రంముందాగింది. ‘లింగాచారి’ చేతిలో చిన్న సంచితో బస్సు దిగాడు. ‘నా ప్రయాణం యింకా చాలదూరం’ అన్నట్లు దుమ్ము లేపుకుంటూ బస్సు కదిలి ముందుకు సాగిపోయింది.

లింగాచారి ఒకసారి పరిసరాలకేసి దృష్టిని నిగుడించాడు. బస్సు దిగిన అపరిచిత వ్యక్తిని ఒకసారి వింతగాచూసి ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమయ్యారు చుట్టుపట్లనున్నవాళ్ళు తనకు చిరపరిచితమైన పరిసరాలను, వ్యక్తులను చూసి ఒక నిమిషం హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కి మళ్ళీ అంతలోనే రేలుపుట్టిన దొంగలాగా చిప్పుక్కుమంది. లింగాచారి వాతతో తను వేయవలసిన వైపుకు అడుగులు వేశాడు.

వీధుల్లో ఎవరూ పలకరించకపోయే సరికి ‘తన్నెవరూ గుర్తుపట్టలేదన్నమాట’ అనుకున్నాడు లింగాచారి ఒకసారి తన శరీరాన్ని అంటిపెట్టుకుని ఉన్న మురికి గుడ్డల్నీ, గిజిగాడి గూడులాగా పెరిగిన బవిరిగడ్డాన్ని చూసుకొని కలుక్కుమన్న హృదయంతో భారంగా అడుగులు వేయ సాగాడు.

నడుస్తున్న లింగాచారికి పరిసరాల్లో కాలం తెచ్చిన మార్పు ప్రస్ఫుటంగా కొట్టొచ్చినట్లు కన్పించింది. నూతనత్వం, నవ్యత్వం ఎక్కడ చూసినా చిందులు తొక్కుతోంది. అప్పటి గుడిసెలున్న చోట మిద్దెలు వెలిశాయి. మిద్దెలు డాబాలలాగా పరివర్తనం చెందాయి. కాని సత్రంలో మాత్రం మార్పేమీరాలేదు. అప్పుడూ అది బిచ్చగాళ్ళకు వాసయోగ్యంగా ఉండేది. ఇప్పుడూ అదే అవస్థలో ఉంది. కాకపోతే అప్పటికంటె గోడలు మరికొంచెం నలుపెక్కి శైథిల్యానికి ఆఖరిమెట్లలో ఉన్నాయి. వాటి దిక్కూ, మొక్కూ పట్టించుకునే నాధుడెవడూలేక సత్రంలోని స్తంభాలకు గుడ్డ ఉయ్యాలలుకట్టి తమ తమ పిల్లల్ని నిద్రపుచ్చటానికి ఊపుతున్నారు పురుషులు. సత్రం క్రిందనే రాతి పొయ్యిలమీద ఆ రాత్రికి ‘తిండి’ కోసం ఏర్పాట్లు చేసుకొంటున్నారు స్త్రీలు.

లింగాచారి బారెడు గడ్డంలో ఒక చిరునవ్వు మెరుపు మెరిసి అదృశ్యమయింది. ‘ఇక జీవితంలో యీ ప్రదేశానికి రాగూడదు’ అనుకున్నాడు తను. కాని మాతృభూమి అనే ఋణానుబంధం ఎంత గొప్పదో కాని తనను మళ్ళీ యిక్కడికి పట్టిలాక్కొస్తున్నది. తన తండ్రి తాతలు నివసించింది యీ ఊళ్ళో. తను పుట్టి పెరిగింది యీ ఊళ్ళో. తనకొక ‘స్వగృహ’ మంటూ ఉన్నది యీ ఊళ్ళోనే. అలాంటి స్వగ్రామం తనకెందుకు విషంగా మారి తనిక యీ ఊరు రాకూడదు అనుకొన్నాడు?

దీనికంతటికీ కారణం ‘ప్రారబ్ధం’ అనుకుంటాడు లింగాచారి. ఆ ప్రారబ్ధమే తనచేత తప్పుడు పని చేయించింది. ఆ ప్రారబ్ధమే తనను మానసికంగా శారీరకంగా చేసిన తప్పుకు శిక్షను అనుభవించేట్లుచేసింది. ప్రారబ్ధాన్ని మించింది మరొకటిలేదు’ అనుకున్నాడు

ఏదయితేనేం ‘విధి’ మళ్ళీ తన్ను స్వగృహానికి లాక్కొచ్చింది. కాని తనను గ్రామస్థులు క్షమిస్తారా? తనరాకనుచూసి సహిస్తారా? ఊహూ. సామాన్యమైన మోసం చేశాడా వాళ్ళను? ప్రాణాలు ఉన్నంతవరకు మరచిపోని నేరం చేశాడు.

నల్లటి చీకటి సందుల్ని ఆశ్రయించింది. ఆ గొందుల్లోబడి తన యింటివైపు నడుస్తున్నాడు లింగాచారి.

తన యిల్లు ఎలాంటిస్థితిలో ఉంటుందో! ఒక దశాబ్దంగా దీపసంస్కారమున్నాలేకపోతే మామూలుస్థితిలో ఎలాఉంటుంది? ఒక అడుగుమందాన యిల్లంతా దుమ్ము కొట్టుకొని ఉంటుంది. గోడలు ఉప్పురిసి కూలిపోవటానికి సిద్ధంగాఉండి ఉంటాయి, పై కప్పు నేడా, రేపా అన్నట్లుంటుంది. ఆవరణంతా వడిమొలిచిన జిల్లేళ్ళతోటి, నాగజెముడు పొదలతోటి, అల్లిబిల్లిగా అల్లుకున్న పిచ్చిమొక్కలతోటి ఒక చిన్న అడవిని స్ఫురణకు తెస్తూ ఉంటుంది. నరసంచారం లేకపోవటంవల్ల పాములూ, తేళ్ళూ, పిశాచాలూ వాసయోగ్యం చేసుకొని ఉంటాయి. అలాంటి భీభత్సవాతావరణంలోకి యివాళ అడుగెట్టాలికాబోలు, తన యింటి స్థితిని తలచుకొనే సరికి లింగాచారి కన్ను కొద్దిగా చెమ్మగిల్లాయి.

నాలుగయిదు గొందులూ, సందులూ తిరిగి ఒక గొందిలో ప్రవేశించాడు లింగాచారి. ఆ గొందిని చూడగానే మళ్ళీ పురాతన స్మృతులు తన్నుకురా సాగాయి. ఒకప్పుడు ఆ యింట్లోనుండి ఎప్పుడూ విశ్రాంతి అన్నమాట లేకుండా సుత్తెమోత వినిపిస్తూ ఉండేది. గాలి పొయ్యిలమీద మట్టి మూసల్లో బంగారం కరిగి ఆ యింటివారి చేతుల్లో వివిధ రూపాలు ఏర్పరచుకుంటూ ఉండేది. మరి యిప్పుడో ఆ యింట్లో భయంకరమైన నిశ్శబ్దం మకుటంలేని మహారాజులా రాజ్యంచేస్తూ ఉంటుంది.

బారెడు గడ్డంతో వస్తూన్న కొత్త వ్యక్తిని చూసి ఓ కుక్క “భౌ” అని అరుచుకుంటూ మీది కొచ్చింది. ఆ కుక్కను చూసి లింగాచారి కడుపు తరుక్కుపోయింది. ‘చిట్టీ’ అని పేరు పెట్టి పిలిచాడు రుద్ధకంఠంతో. ఆ స్వరాన్ని గుర్తించిన కుక్క తోకాడిస్తూ కాళ్ళను నాకుతూ అడ్డంగా మెలికలు తిరగసాగింది. పదేళ్ళ క్రిందట తను బ్రతికి బాగున్న రోజుల్లో యిదే కుక్కకు రోజూ పట్టెడు మెతుకులు

వేసేవాడు. అప్పుడది వయసులో బలిసి చూడటానికి పులిపిల్లలాగా ఉండేది. కాని ఇప్పుడు వార్ధక్యం దానిమీద కూడా ప్రవేశించి, జవసత్వాలను పీల్చటంవల్ల పేగులు బయటికొస్తున్నాయి.

అదే గొందిలో అయిదారిళ్లు దాటిన లింగాచారి హఠాత్తుగా నిలిచిపోయాడు. ఆశ్చర్యం, అనుమానం, భయం యీ మూడూ ముప్పేటలుగా ముడేసుకొని, హృదయాన్ని బయటికి లాగుతున్నట్లనిపించింది. ఒక పీనాసి, కొల్లగొట్టబడిన తన యినప్పెట్టెను చూసి ఎలాంటి అనుభూతిని పొందుతాడో అలాంటి అనుభూతిని పొందసాగాడు లింగాచారి.

ఎదురుగా ఉన్నది తన స్వగృహం. ఏ యిల్లు నిశ్శబ్దంగా, నీరసంగా ఉంటుందని తననుకున్నాడో ఆ యింట్లో నుండి సుత్తె మోత. ఏమీ పాలుపోలేదు లింగాచారికి. ఇదంతా దయ్యాల ప్రభావమేమోనని అనుమాన మేసింది. కాని లోపల దీపం వెలుగుతున్నది. బయటి తలుపు లోపలి వైపు గడివేసి ఉన్నది. ఇక సందేహం లేదు. తన యింటిని ఎవరో స్వాధీనం చేసుకున్నారు. ఏ యింట్లో తన జీవిత శేషాన్ని ఎన్ని కష్టాలకయినా ఓర్చి గడుపుకుందామని వచ్చాడో, ఆ యిల్లు పరాధీనమయింది. ఇక తన బ్రతుకు వ్యర్థం. ఎక్కడలేని, నిస్సత్తువా వచ్చి ఆవేశించింది శరీరంలో. ఇంటి ఎదురుగా ఉన్న అరుగుమీద అప్రయత్నంగానే చతికిలపడాడు. గతమంతా ఒక్కొక్కటే గుర్తుకు రాసాగింది.

తన తండ్రి తాతలు బంగారపు పనిలో బాగా చెయ్యి తిరిగినవారు. చిన్నప్పటినుండి తనకూ ఆ పనిలోనే గురికుదిరింది. క్రమంగా తనకు వయసు వచ్చేసరికి ఆ పనిలో ఉన్న మెలకువలు, లాభనష్టాలూ అన్నీ అవగతమయ్యాయి. తండ్రి చనిపోయే సరికే తను "మంచిపనివాడని" పేరు తెచ్చుకున్నాడు. పేరుతో బాటే ధనలక్ష్మి గూడా "ఘల ఘల" మంటూ తన యింట్లో వాలింది. ఎప్పుడు చూసినా తనకు చేతినిండా పని ఉండేది. వేల ఖరీదు చేసే బంగారం తన చేతుల్లో కరుగుతూ ఉండేది. వస్తువులుచేసి నందుకు వచ్చే మజూరీయే కాకుండా, "గిటురాయి" మీద కొద్ది బంగారం తీసేవాడు. అంతే కాకుండా మరికొంత బంగారాన్ని కూడా ఒడుపుగా చాకచక్యంతో వస్తువులనుండి కత్తిరిస్తూ ఉండేవాడు తను. కాని తన పని నైపుణ్యాన్ని చూసి యీ సంగతి ఎవరూ కనిపెట్టలేక పోయేవారు

ఒక దశాబ్దం క్రిందట అవి ఎండాకాలపు రోజులు. ఊరినిండా ఎక్కడ చూసినా పెళ్ళిళ్ళే, ఎక్కడ చూసినా పెళ్ళి పందిళ్ళే. లింగాచారి సొరుగునిండా బంగారం వచ్చి చేరింది. అంత బంగారాన్ని ఒక్కసారిగా చూసిన లింగాచారి కన్ను,కన్నుతోపాటే మనసుకూడా కుట్టింది. దుర్మార్గపు ఆలోచనలు మెదడులో చేరి సుళ్ళు తిరుగుతూ అతనిలోని మంచిని అవతలికి నెట్టివేశాయి. మనసులోని నైర్మల్యంపైన మాలిన్యం, నల్లటి గుడ్డను కప్పింది. "ఈ బంగారాన్ని తీసుకొని కుటుంబంతోసహా ఎక్కడో ఒక మూరుమూల ప్రదేశానికిపోతే నిశ్చింతగా కాలం గడపవచ్చు" అనుకున్నాడు లింగాచారి. ఈ పాపపు ఆలోచనకు భార్య నెత్తి నోరు కొట్టుకుంది. పరుల సొమ్ముతో మన పిల్లలు ఎక్కిరాచేరండి. మన వంశం నాశనమవుతుందండి. ఇప్పటు మనకేం తక్కువయిందని యీపాడు బుద్ధి" అని. కాని లింగాచారిలో గడ్డ కట్టుకపోయిన లోభం ఆమె మాటలను పెడచెవిన పెట్టింది.

ఆ మర్నాడే కుటుంబంతోసహా పరారయాడు లింగాచారి. జరిగిన సంఘటనకు గ్రామస్థులు నివ్వెరపోయారు. వెంటనే సొమ్ము నష్టపడ్డ వాళ్ళందరూ కలిసి పోలీలకు రిపోర్టు చేశారు. పోలీసులు లింగాచారి ఆనవాళ్లు, గుర్తులూ తీసుకొని అన్వేషణకు వెళ్ళిపోయారు. కాని యింతలోనే అందిన మరో ఘోరమైన వార్తతో గ్రామస్థులు తమ సొమ్ము తిరుగి కదక్కదని నీళ్లకారిపోయారు. "గోదావరి నదిలో భద్రాచలానికి పోతున్న లాంచీ, నది మధ్యలో ప్రమాదానికి గురిఅయి, అందులో ప్రయాణం చేస్తున్న పదిమంది ప్రయాణీకులలో తొమ్మిది మంది నదిలో మునిగిపోయారని, సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న వ్యక్తి పేరు 'లింగాచారి' అని వారికందినవార్త.

బ్రతికి బయటబడ్డ లింగాచారిలో మానసికంగా ఎంతో పరివర్తన వచ్చింది. తన పాపానికి ఫలితంగా కుటుంబమంతా నాశనమయినందుకు, కుమిలిపోయాడు. పోలీసులు తనకోసం గాలిస్తున్నారన్నవార్త తెలిసి మరీ కృంగిపోయాడు. ఆ తరువాత రెండురోజులకే పోలీసులు లింగాచారిని అరెస్టు చేశారు. విచారణలో లింగాచారికి పది సంవత్సరాల కారాగారవాసం విధించబడింది. 'తనుచేసిన నమ్మక ద్రోహానికి తగినశిక్ష' అనుకున్నాడు లింగాచారి. అటు కుటుంబాన్ని సమూలంగా నాశనం చేసి దైవం శిక్షించాడు. ఇటు పదేళ్లు జైలు శిక్ష విధించి చట్టం శిక్షించింది. తన పాపఫలం యిలా పండింది.

పదేళ్లు గడిచిపోయాయి. జైలునుంచి విడుదలయ్యాడు లింగాచారి. గమ్యం అగమ్యంగా తోచింది. ఇక మళ్ళీ తన పాడు ముఖాన్ని తన గ్రామంలో చూపటం కంటె మిగిలిన శేషజీవితాన్ని ఏ అజ్ఞాత సీమల్లోనో గడిపివేస్తే మంచిదని తోచింది. మళ్ళీ అంతలోనే స్వగృహం, మాతృభూమి కోసం రక్తం పీకసాగింది. 'అవును తను చేసింది నమ్మక ద్రోహమే, పాపమే. దాన్ని ఎవరూ కాదనరు. కాని తాను అందుకు పరిపూర్ణంగా శిక్షించబడ్డాడు. తన పాపం పరిహారమైపోయింది. అందువలన యిక తను స్వగ్రామం పోవడానికి సిగ్గుపడవలసిన పనిలేదని ప్రయాణమయి తన యిల్లు చేరుకున్నాడు. కాని యిక్కడ స్వగృహాన్ని యీలోపల ఎవరో స్వాధీనం చేసుకున్నారు. తన ఆశలు నిరాశలయ్యాయి. ఈ సంగతి ఎవరితో చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి?

ఇంటి తలుపు తెరుచుకొని ఒక వ్యక్తి బయటికి వచ్చాడు ఎదురుగా చీకట్లో అరుగుమీద కూర్చొని ఉన్న లింగాచారిని

(తరువాయి 21 వ పేజీలో)

## "స్వర్ణకారుడు"

(14 వ పేజీ తరువాయి)

చూసి 'ఎవరది?' అని కేకేశాడు. లింగాచారి బదులు చెప్పకుండా అతనివైపే పరిశీలనగా చూడసాగాడు. కాని ఎంత ప్రయత్నించినా పోలికలు గుర్తుపట్టలేకపోయినాడు. 'మాట్లాడవేం? ఎవరునువ్వు?' మరోసారి రెట్టించాడావ్యక్తి.

'ఈయిల్లు ఎవరిదిబాబూ?' ప్రశ్నించాడు లింగాచారి. 'నాదే' బింకంగా సమాధానమిచ్చాడావ్యక్తి.

లింగాచారిలోని రక్తం యీ సమాధానానికి సరసరలాడింది. అయినా తమాయించుకొని 'ఈయింట్లో యిదివరకు లింగాచారని....' 'ఆ.... ఉండేవాడులే దౌర్భాగ్యుడు ఏం! నిన్నుకూడా మోసంచేశాడాయేం?' అసూయతో అక్కసంతా వెళ్ళబోశాడావ్యక్తి.

'అదేమిటి నాయనా అట్లాఅంటావ్?' అన్నాడు లింగాచారి.

'ఔను ఊళ్ళోవాళ్ళ సొమ్మంతా కాజేసి పరారయ్యాడు. అందుకు తగిన శాస్తే జరిగిందిలే. పోలీసువాళ్ళు పట్టుకొని జైల్లో వేశారు!'

'మరి నీవెవరునాయనా' అతడెవరో తెలుసుకోవాలని కుతూహలంగా అడిగాడు లింగాచారి. 'నేను వాడికి దాయాదినిలే. మాకూ, వాళ్ళకూ దూరపు సంబంధాలున్నయ్‌లే. సరేగాని యింతకూ నీవెవరు!' అనుమానంగా అడిగాడు ఆ దాయాది.

'నేనే లింగాచారిని'.

ప్రక్కన బాంబు పేలినట్లు అదిరిపడ్డాడావ్యక్తి. 'ఆ....నీవామావా. నిన్ను నేను గుర్తుపట్టనేలేదే. నేను అప్పలాచారిని. ఎప్పుడో చిన్నప్పుడు ఒక్కసారి చూశావు నన్ను. అరె యింకా యిక్కడే ఉన్నావే పద. లోపలికి పద. చాలా మారిపోయావే. ఆరోగ్యం కులాసాయేనా. ఇంతకూ జైలు శిక్ష పూర్తయిందా?' గుక్కతిప్పుకోకుండా మాటల్లోనే గౌరవాన్ని చూపించసాగాడు అప్పలాచారి. 'ఆ పూర్తయింది. అందుకే యింటికి తిరిగి వచ్చాను' అన్నాడు లింగాచారి.

'ఏదో దీపం పెట్టే దిక్కున్నాలేక యింటిని ఊరికే పాడుపెట్టటమెందుకని మేమొచ్చి ఉంటున్నాం. నీకు మాత్రం లోటేముంది? ఇక నీవుగూడా యిక్కడే ఉండు.' అప్పలాచారి మాటలకు లింగాచారి సంతోషించాడు.

ఆ రాత్రికి ఒక గౌరవనీయమైన అతిథికి లభించే ఆదరసత్కారాలు లింగాచారికి లభించాయి. మరగబెట్టిన వేడినీటిలో స్నానం చేయించి, వెంటనే కట్టుకోడానికి ఉతికిన బట్టలిచ్చి, పాడిగేదె పెరుగుతో అన్నం పెట్టించాడు అప్పలాచారి.

లింగాచారి పొంగిపోయాడు. ఆ రాత్రి మంచంమీద పడుకొని ఆలోచించాడు. 'ఇక తనకు మాత్రం ఎవరున్నారు? ఇప్పుడెవరూ తనను నమ్మి తనకిక పనినివ్వరు. అలాంటి పరిస్థితిలో తనకు జీవనాధారమేమిటి? అందువలన తను యిక్కడే ఉంటే తను బ్రతికినన్నాళ్ళు అప్పలాచారి తనను పోషిస్తాడు. ఆ తరువాత యిల్లు వాళ్ళ స్వంతమవుతుంది. అయితే కానియ్యి తన తదనంతరం ఆ యిల్లు ఎవరికి చెందితేమాత్రం తనకేం. కాని తన మిగిలిన జీవితకాలమంతా పొట్టకు, బట్టకు లోటురాకుండా ఉండాలి'.

చాలా పొద్దుపోయే వరకు యింట్లో నుండి ఎవరో కీచులాడుకొంటున్నట్లు భార్యాభర్తలకు సంభాషణ జరిగింది. ఆ సంభాషణ తన గురించేనని లింగాచారి గ్రహించకపోలేదు. ఎన్నో మలుపులు తిరిగిన తన జీవితాన్ని గురించి ఆలోచించుకుంటూనే నిద్రపోయాడు లింగాచారి.

మార్నాడు తెల్లవారి, తెల్లవారకముందే అప్పలాచారి యింట్లో నుండి బయటికొచ్చాడు. అప్పటికింకా లింగాచారి నిద్రే లేవలేదు. గ్రామంలోకి పోయి గ్రామస్థులకందరికీ లింగాచారి రాకడను గురించి తెలియజేశాడు అప్పలాచారి. అంతటితో ఊరుకోకుండా అతణ్ణి యింట్లో చేరనిస్తే యింకా ఎన్నో ప్రమాదాలు వాటిల్లుతాయని కనుక మీ యిష్టమొచ్చిన పనిని చేయండి" అని నిప్పును గప్పిన నివురును ఊది దులిపివేశాడు.

గ్రామస్థులలో అప్పలాచారి మాటలతో పాతపగ బుసలుకొట్టింది. ఇలాంటి చీడపురుగును ఊళ్ళోకి చేరనిస్తే యింకా ఎంతమంది సొమ్ములకు నష్టం కలుగుతుందోనని అతనివల్ల పూర్వం సొమ్ము నష్టపడ్డవాళ్ళందరూ కఱ్ఱలుపట్టుకొని లింగాచారి యింటిమీదికి బయలుదేరారు.

అప్పుడే నిద్రలేచిన లింగాచారి ఊళ్ళో వాళ్ళందర్నీ దాడికి గట్టుకొని వస్తున్న అప్పలాచారిని చూసి నిర్ఘాంతపడి పోయాడు. దాయాదిద్వేషం యింత విషం కక్కుతుందని ఊహించలేక పోయాడు. నోట మాటరాక అవయవాలన్నీ స్తంభించిపోయాయి. జరుగబోయే సంఘటనను ఊహించుకొనేసరికి ఒళ్ళంతా వణుకు ప్రారంభమయి చిరుచెమటలు పట్టాయి.

'ఊ చూస్తారేం. యీడ్చుకురండి బైటికి' ఒకంఠం కోపంగా పలికింది.

పదిమంది లోపలికివచ్చి స్తంభీభూతుడైన లింగాచారిని బరబరా బైటికిలాక్కొచ్చారు. చుట్టూ కఱ్ఱలు పట్టుకొని యమభటుల్లాగా నిలబడ్డారు గ్రామస్థులు. ప్రతివాడి ముఖంలోనూ కోపం, అసహ్యం, పగతీర్చుకోవాలన్న తీవ్రమైన కోరికా, కళ్ళలోని కసినిచూసి చలించిపోయి, అయోమయంలో పడ్డాడు లింగాచారి. పిచ్చిచూపులు చూడటం మొదలు పెట్టాడు. 'ఏం అట్లా చూస్తావ్ పిచ్చివాడిలాగా' ఎవరో వెక్కిరించారు.

లింగాచారికి ఏంచేయాలో తోచలేదు. వాళ్ళ వాలకంచూస్తే తన అంతం యీరోజు తప్పదన్నట్లుంది. అయినా లేని ధైర్యం కూడగట్టుకొని రెండు చేతులు జోడించాడు. 'తప్పించుకపోవాలని చూస్తున్నాడు' గుంపులోంచి ఒకవ్యక్తి అన్నాడు. లేదు. ఇకనేను ఎక్కడికీ తప్పించుకపోను. నేను మీకందరికీ అన్యాయం చేశాను.

(తరువాయి 20 వ పేజీలో)

## "స్వర్ణకారుడు"

( 21 వ పేజీ తరువాయి)

మోసం చేశాను. దానికి ఫలితంగా యీ జన్మలోనే అలుబిడ్డల్ని గంగపాలు చేసుకొన్నాను. పదేళ్ళు కారాగారంలో క్రుంగిపోయాను. ఇక నన్ను మళ్ళీ చంపకండి మీ పాదాలు పట్టుకుంటాను! భయంతో ఒక్కొక్క మాటకూడ బల్కుకుంటూ అన్నాడు లింగాచారి.

"అసలా పాడుబుద్ధి నీ కెందుకు పుట్టాలంట?" ఇంకొకళ్ళు అడిగారు.

"క్షమించండి బుద్ధితక్కువయి పాపం చేశాను. చచ్చినపామును మళ్ళీ చంపకండి నన్ను వదిలెయ్యండి" దీనంగా ప్రార్థించాడు లింగాచారి.

"చూస్తారేంరా. మాటలుచెప్పి, తప్పించుక పోవాలను కుంటున్నాడు వెయ్యండి" ఉడుకుపాలు జాస్తిగాఉన్న ఓ యువకుడు అనటమే కాకుండా కార్యరూపేణా చేసి చూపించాడు. కాళ్ళమీద తగిలిన దెబ్బకు కుప్పలా కూలిపోయ్యాడు లింగాచారి. ఏదో మాట్లాడదామని ప్రయత్నించినా ఎవ్వరూ వినిపించుకోలేదు.

ఒకటి వెంబడి ఒకటిగా ప్రతిఅవయవం మీద కఱ్ఱదెబ్బలు తగులుతున్నాయి. లింగాచారికి ఒళ్ళంతా నజ్జు నజ్జు అయింది పరిసరాలనిండా రక్తం చిందింది. లింగాచారి బాధతో గిలగిల కొట్టుకొన్నాడు.

'ఊఁ యికచాల్లెండర్రా. కంసాలిపీనుగ చస్తుంది.' అంతటితో జాలిపడ్డాడొక వ్యక్తి. కఱ్ఱలుతిరగటం ఆగిపోయ్యాయి. రక్తంలో తడిసిపోయి విలవిల కొట్టుకొంటున్న లింగాచారిని పురుగును చూసినట్లు, అసహ్యంగాచూసి అంతా వెళ్ళిపోయారు. ఒక విషపువ్వునన్వి, అప్పలాచారి తలపు బిగించుకున్నాడు.

మిటమిటలాడిస్తూ సూర్యుడు పైకొచ్చాడు. 'తనుచేసిన పాపానికి యిదే అంతిమ శిక్ష' అనుకొని బాధతో కళ్ళు మూశాడు లింగాచారి. అంతటిలో స్వర్ణకారుడి జీవితం పరిసమాప్తమయింది.

---

## మాధవీలత

( 18వ పేజీ తరువాయి)

పోవటం సహజం. కాని నాకు దూరం కావటమనేది మాత్రం అసహజం. నా హృదయంవిప్పి చూచుకొంటె అవ్యక్తి దర్శనం నాకులభిస్తుంది. నిద్రావస్థలో సహితం ఆమూర్తి నాస్వాహాపథంలో విహరిస్తుంది నాహృదయదర్పణంపైన ప్రతిఫలిస్తుంది. నా మేధస్సులో సాక్షాత్కరిస్తుంది.

లతాదేవీ! అందుకేకాబోలు పరమేశ్వరుడేమిచేసినా మనమేలుకోరే చేస్తాడంటారు సంకల్ప వికల్పాలు భగవదాధీనాలు. నిజంగా మానవాధీనాలే అయితే ఈ ప్రపంచం ముందుకు నడవదేమో!

యదార్థం గ్రహించుకో లతాదేవీ! ఒకప్పుడు మనం సంకల్పించుకొన్నరీతిగా నీవు నాదానివయితే ఎలావుండేదంటావు? క్షమిస్తానంటే ఒక నగ్నసత్యం నీముందుంచుతాను. నిజంగా నిన్ను నేను పొందినట్లయితే నా కౌగిలిలో కరిగిపోయేదానివేమో! ఆ ప్రేమ పరమార్థమయేదేకదూ! ఈనాటిలాగా నీవు నాహృదయదర్పణంపై సర్వథా ప్రతిఫలించేదానివా! కలల్లో సహితం సాక్షాత్కరించేదానివా! ఆనాడు నాలోని పురుషత్వం నీలోని స్త్రీత్వాన్ని, యవ్వనాన్ని, బాహ్యసౌందర్యాన్ని ప్రేమించింది. కాని ఈనాడు నాలోని ఆత్మ నీలోని ఆత్మను ప్రేమిస్తోంది. రెండు ఆత్మలు ఐక్యంకావటంకన్న మహోన్నత ప్రేమ మరొకటి ఏముంటుంది లతాదేవీ!

ఇప్పటికే చాలా రాశాను కదూ! నిజంగా ఇందులో నేను వ్రాసిందంటూ ఏమీ లేదు వ్రాయాలంటే మేధస్సు నుపయోగించాలి కాని నేను చేసిందది కాదుగా! నా హృదయ ఫలకంమీద రెడీగావున్న పంక్తుల్ని యథాతథంగా కాపీచేసి నీకు పంపుతున్నాను. అంతే! మిగిలిపోయిందేమైనా వుంటే మరోసారి వ్రాసి పంపుతా. ఇప్పటికిక శెలవు....!

---

## ఆంధ్రాబ్యాంకు తరలింపు

( 23 వ పేజీ తరువాయి )

అల్ప సంఖ్యాకుల స్వల్ప ప్రయోజనాల కోసం కంటే అనేకమందికి అసంతృప్తిని కలిగించే ఈ కార్యం, సుహృద్భావముతో నివారించడం, అధికారుల కనీస ధర్మము. బ్యాంకు అభివృద్ధికి అశేషంగా కృషి చేస్తున్న పాలకవర్గం తమ ధర్మాన్ని తప్పరనే ఆశిస్తున్నాము.

—ఒక పౌరుడు.

---


## ప్రకటన

కృష్ణా డిస్ట్రిక్టు కోర్టులో

E. O. P. 125 – E. O. P. 126 / 61

Between :

పెన్మెత్స రామభద్రరాజుగారు
- పిటీషనరు

and

1. శ్రీ రాజా అలివేలు మంగతాయారమ్మా రావు బహద్దూరు జమిందారిణీగారు
2. శ్రీ రాజా రాజ్యలక్ష్మి పాపాయమ్మా రావు బహద్దూరు జమిందారిణీగారు
3. శ్రీ రాజా మొఱరాజు వెంకట రామకృష్ణ కొండలరావు - రెస్పాండెంట్లు

పిటీషనరు 1 & 2 రెస్పాండెంట్లు తల్లిగారయిన శ్రీ రాజా మహాలక్ష్మి వెంకాయమ్మా రావు బహద్దూరుగారు 25 - 11 - 42 తేదీన వ్రాయించి యిచ్చిన తనఖా దస్తావేజులో హామీగావున్న రే హూ డి: గొల్లమండలః ముచ్చనపల్లి గ్రామంలు, అస్తులను శ్రీ గవర్నమెంటువారు యెస్టేటు abolition Act కింద తీసుకునే Final Compensation కింద డిపాజిటు చేసిన మొత్తంకు, పిటీషనరు తన క్లెయిం రికగ్నయిజు చేయించమని దాఖలు చేసిన పిటీషను నోటీస్కు 5-12 61 తేదీకి వాయిదా వేయబడినది. గనుక యెవరికైనా, యేమయినా ఆక్షేపణలున్నయెడల సదరు తేదీన పగలు 10 గంటలకు సదరు కోర్టులో హాజరుఅయి తెలుపుకోవలెను. లేనియెడల యక్సపార్టీ వుత్తర్వులు Pass చేయుదురని. యిందు మూలంగా ప్రచురపరచటమైనది.

(Sd) మండల శ్రీనివాసరావు
అడ్వకేటు.